గృహజ్వాల

దువ్వూరి వేంకటేశ్వరశర్మగారు

౧

సత్యప్రకాశుని జన్మోత్సవమందు వానితండ్రియగు లాలా దేవప్రకాశుడు చాలా ద్రవ్యము ఖర్చుపెట్టి బంధువులు, మిత్రులు, ఇతరగ్రామస్థులను ఆదరించి ముదమునొందెను. సత్యప్రకాశునకు బాల్యప్రాయములోనే విద్యాభ్యాసము మొదలిడిరి. అనుదినము పాఠశాలకు వెళ్లుటకు, సాయంకాలము షికారుతిరుగుటకు ఒక చిన్న యానముయేర్పడెను. నౌకరుపిల్లవాడు అతనిని పాఠశాలకు శ్రద్ధాభక్తులతో తీసుకొనివెళ్లి సాయంకాలము మరల గృహమునకు తోడ్కొనివచ్చుచుండెను. బాలుడు ఎంతో గుణవంతుడు; సుందరమైనస్వరూపముగల వాడు. పున్నమచంద్రుడువోలె గుండ్రనిమోము, విశాలమైనమస్తకము, నీలకమలములవంటి నేత్రద్వయము, పండినతేటతమలపాకులవంటి అధరము, పుష్టిగా యుక్తమైన శరీరసౌష్ఠవముతో సొంపారుచుండెను. ఈతనిని చూచినవారినోటినుండి "దీర్ఘాయుష్మాన్ భవ" అనే ఆశీర్వచనాత్మకవాక్యములు నిష్ప్రయత్నముగానే వచ్చుచుండెను. ఈవిధముగా నిత్యాభివృద్ధిపొందుచుండెను సత్యప్రకాశుడు.

వర్షాకాలసమయమున గంగానది అతిఘోరఘుంకారవముతో ఉత్తుంగతరంగములను చూపుచూ అతిగర్వముగా, ఎదుటనున్నవారిని నిర్లక్ష్యబుద్ధితో సులభముగా తొలగించుచూ తన ఐశ్వర్యము చూపుచుండెను. దేవప్రకాశుడు తనప్రియురాలయిన నిర్మలనుతోడుకొని ఒకపర్వదినమున గంగాతీరముచేరెను. నిర్మల అనిర్మలమైన ఆజలములో సంతోషముతో ఉప్పొంగుచూ జలక్రీడలుసలుపసాగెను. కొంతసమయానంతరమున దేవప్రకాశుడు భార్యను స్నానము ముగించమనగా ఆమెకు వినువుతీరక "నేను గొంతుకలోతు నీళ్లలోకి దిగి నిర్భయముగా స్నానముచేయగల"నని జవాబుచెప్పి లోతునీళ్లలోకి దిగెను. భర్త అనేకసారులు మందలించెను కాని మృత్యుదేవత తలపైతాండవమాడుసమయమున ఆమాటలనామె ఏలపాటించును? ఒకక్షణములోనే జలక్రీడ మృత్యుక్రీడాయెను. ఈతరాని ఆయబల ఒకసారిమునగగానే ధారావేగమునకాగలేక ఒక్కకేకవేసి సర్వకాలమునకు తరంగములతో క్రీడించుటకుపోయెను. దేవప్రకాశుడు నీటిలోదుమికి వెతకసాగెను. కాని వ్యర్థము. పల్లెవాండ్రును ఇతరులును వెతికివెతికి నిరాశులైరి.

దేవప్రకాశుడు ఇంటికిరాగానే కొమారునిజూచి దుఃఖముపట్టజాలక అతని కౌగలించి దుఃఖింపసాగెను. తండ్రివాలకముజూచి సత్యప్రకాశుడు "అమ్మ యేది?" అని ప్రశ్నింపగా ఆమెను "గంగాదేవితో కేళీవిలాసము సలుపుటకు ఉంచివచ్చితి"నని జవాబుచెప్పెను. కొంతసేపు బాలుడు తండ్రిముఖము వీక్షించుచుండి భావముగ్రహించి "అమ్మా! అమ్మా!" అని యేడ్వసాగెను.

౨

మాతృహీనుడైన బాలుడు సర్వజనులకు ప్రియమైనప్పటికిని దీనుడే. ఎంత ధనహీనసంసారములో ఉన్నప్పటికి తల్లిఒడియందు ఆమె ప్రేమసాగరములో ఈదులాడుచూ జీవనముగడుపువాడిజన్మ ఆనందమయమని నమ్మవచ్చును. కాని సత్యప్రకాశునికి ఈసుఖమంచనమేకాక దైవాధారముకూడా దూరమాయెను. ఈశ్వరునకుకూడా ఈ తల్లిలేనికొడుకుయందు అసహ్యముకల్గెను; అందుచే తల్లిలేని ఆశిశువు రెక్కలేనిపక్షివలె నుండును.

సత్యప్రకాశుడు ఏకాంతప్రియుడాయెను. అతనికెల్లపుడు ఒంటరిగాకూర్చొనుట, తిరుగుట, నిశ్శబ్దమైన కాననమందు వనలక్ష్మితో తన హృదయవేదన వెల్లడించుచూ కాలముగడుపుట అభ్యాసమాయెను. తల్లి

ప్రేమ లేనపుడు సకలసంసారమునందుకూడా విరక్తిగల్గెను. తండ్రిహృదయమందుకూడా సత్యప్రకాశునికి నిర్మించిన స్థానము తొలగెను. ఆతడు ఒక నూతనసంసారముయొక్క సుఖస్వప్నమును చూచుచుండెను. లోకములో ఎచ్చటనైనా భిక్షుకుని నిరాకరించేవారు కాన్పడెదరుగాని ప్రేమించు తత్వజ్ఞానులు కాన్పడరు.

ఇట్లు ఆరుమాసములుగడచెను. ఒకనాడు సత్యప్రకాశుని ముఖమండలము గ్రహణమువిడచిన చంద్రునివలె కాంతినొందెను. సంతోషము మరల వసంతవృక్షమువలె పత్రపుష్పాదులతో ప్రకాశించెను. కారణమేమి? ప్రేమచే మర్మాహతుడైన సత్యప్రకాశుడి హృదయతటాకము మరల నవాగతమాతృప్రేమ జలపూరితమాయెను. తాను మరల తల్లిప్రేమకు పాత్రుడగునని తెలిసి సంతోషమునొందెను. తాను పోగొట్టుకొన్న అపూర్వజీవనము మరల కాన్పడునని తలచెను. పూర్వమువలె తల్లి తన్ను ప్రేమించి, ఎత్తుకుని, అన్నము తినిపించి, సంరక్షణచేయుననియు తాను ఈసారి తల్లితో ఏవిషయమునుగురించియు అధికప్రసంగముచేయక ప్రేమపాత్రుడగుదుననియు తలచెను. వాని ఆనందసాగరమందు అనేకకల్పనాతరంగములు లేచి మరల పడిపోవుచుండెను. నూతనమాత ఇంటికివచ్చుటకుపూర్వము అనేకఉత్సవములుజరిగెను. సత్యుడు వానినన్నింటినిజూచెను. క్రొత్త విలువైన దుస్తులు అనేకముస్తాబులతో కొంతకాలముగడిపెను. తల్లినిచూచి సంతోషించెను. సుందరలావణ్యమయమైన శరీరము కాంచనభూషణములతో అలంకరించబడెను. ఆమె కొంగుపట్టుకొని సత్యుడు సంతోషముతో 'అమ్మా!' అని గట్టిగా అనెను. ఎంతకాలమునకు ఆతడు "అమ్మా!" అనుశబ్దమును ఉపయోగించక ఇదేసమయమని తలచి మరీగట్టిగా 'అమ్మా' అనిఅరచెను. ఆశబ్దములోఉన్న మధురిమ, ప్రేమ, శక్తి, ఆనందము వర్ణించతరముకాదు. కాని హా! ఏమి వైచిత్ర్యము? ఈశ్వరుడు మానవునితలంపులు ఎల్లకాలము దీర్చడు. మనుష్యుడు ఒకటితలచిన దైవము మతియొకటి తలచుచుండును. ఆసుందరాంగికి ఈమధురశబ్దము కఠోరకుఠారాఘాతమువలె తగిలెను. ఆమెకు ఈసంబోధన అసహ్యమాయెను. ఆమె యౌవనముయొక్క సుఖస్వప్నములను చూచుచుండెను. ఉప్పొంగివచ్చుకోపము నాపుకొనలేక ముఖముచిట్లించుకొని "నన్ను అట్లు పిలువవద్దు" అని పలికెను.

సత్యప్రకాశుడు అత్యాశ్చర్యముతో ఆమెవైపు చూచుచూ నిర్ఘాంతపోయెను. తన కల్పనాశక్తిచల్ల నిర్మించిన మేడలు ఇసుకగోడలవలె కూలిపోయెను. దుఃఖము పొర్లిపొర్లివచ్చెను. అశ్రుబిందువులే దానికి సాక్షి. పెళ్లికూతునిముసలమ్మ పిల్లను మందలించి "అట్లు చేయవద్దు. పిల్లవానిహృదయమునొచ్చు"నని బోధించెను. కాని ఆదేవప్రియమాత్రము తనకి "అమ్మా!" అను సంబోధనముకూడదని చెప్పి వెళ్లిపోయెను.

3

ప్రపంచములో 'సవతి' అన్నశబ్దమే కర్ణకఠినముగానున్నది. కారణము తెలియదు. అందులో ఉన్న అసహ్యము, దురభిప్రాయము దానిని దరికిచేరనీయదు. అందులో సవతిపిల్లలగతి ఇక చెప్పనక్కరలేదు. దేవప్రియ ఎట్లనో కొంతకాలము అట్లనె గడపెను. తాను గర్భిణీ అగునంతవరకు సత్యునితో అపుడపుడు మాటలాడుచూ కన్పడెనుకాని ఇప్పుడు అదియు అరుదాయెను.

సుఖదుఃఖములు త్రాసుపళ్లెమువలెనుండును. ఒకచోటనే రెండును హెచ్చుచూ తగ్గుచుండును. సత్యప్రకాశునికి తమ్ముడు గల్గెనని సంతోషము నాలుగురోజులనుండి ఉండెను. కాని తమ్ముని మోముచూచుట లభించలేదు. ఒకనాడు తల్లిఒడిలోఉన్న బాలునిచూచుటకు ఈతడు అతిఉత్కంఠతోవెళ్లి పైనకప్పినబట్ట తీసెను. వెంటనే పుట్టలోఉన్నత్రాచువలె బుసకొట్టి ఆమె "నిద్రపోతున్నవానిని లేపకు" అని కసరెను. బాలుడు సత్యప్రకాశుడు ఏమిచేయగలడు? ప్రపంచకలక్షణములు తాను ఏమియునెరుగడు. ఈవ్యవహారములు చూచి తనకు శాంతిఇచ్చేది తన ఏకాంతస్థానమని తలచి అక్కడికివెళ్లి కన్నీరుచే వచ్చినదుఃఖ[illegible] కడుగు

కొనెను. తమ్మునియందు ఉన్న ప్రేమచూపుటకుకాని, తాను శిశువును ఎత్తుకుని ముద్దులాడి అభిలాషతీర్చుకొనుటకుగాని వీలులేకపోయెను. మరియొకనాడు ఉదయము తల్లి గృహకృత్యములు చేయుచుండగా సత్యప్రకాశుడు గదిలో పరుండియున్న బాలునిదగ్గరకుపోయి తనకరువుతీరినట్లు ముద్దులాడి ప్రేమాశ్రువులు వాని బుగ్గలపై రాల్చి ఇన్నాళ్ళకు లభించినఫలమును త్వరలో వీడలేక ఎత్తుకొని ఆడింపసాగెను. బాలుడు తనుకూడా ప్రేమచూపించుటకు ఏడ్పుతప్ప వేరే మార్గములేదని తలచి ఏడ్వసాగెను. ఇంతలో తల్లివచ్చి కోపాగ్నిలో రెజ్జబారి, సత్యుని నిందించి అవతలికి తఱిమివైచెను. శిశువుయందు ప్రేమచేతనా ఆమె సత్యుని వానిదగ్గరకుచేరనీయదు? కాదు. కారణము వేరు. ఈపిర్యాదు తండ్రివిని శిశువును ఏలయేడ్పించితివని సత్యప్రకాశుని అడిగెను. అతడు "నేను ముద్దులాడుచుండగా అతడు ఏడ్చెను. నేను కొట్టలే"దని జవాబుచెప్పెను. అతనిపల్కులు అబద్ధమని తండ్రి వానిని తాడించెను. ప్రేమకు మూలమునందు పుట్టిన ఈ తాడనయే సత్యప్రకాశుని జీవనమునకు మార్పుగల్గించినదాయెను.

౪

మార్పు త్వరలోనే కావచ్చును. నాశనముకూడా త్వరలోనే కావచ్చును. ఆనాటినుండి సత్యుడు ఇంటిలో ఉండుటకుకూడా అసహ్యముకల్గి పరాయివానివలె ఆకలివేసినపుడు భోజనమునకు ఇంటికివచ్చి వెళ్లిపోవుచుండెను. ఎక్కడఉన్నది, ఎక్కడపడుకొన్నది వివక్షత తలిదండ్రులకు అనవసరమాయెను. చదువుకూడా పూర్తిఅయెను. కట్టుకొనుటకు బట్టలుకూడాదొరుకుట అరుదాయెను. అయవారి వీధులే అతని నివాసస్థానములాయెను. క్షుద్రవర్గముయావత్తు మిత్రవర్గమాయెను. మలినవస్త్రములు, దుర్భాషలు మొదలైన దుర్వ్యసనములు అభ్యాసమై చరిత్రము మారిపోయెను. ప్రజలుకూడా నిందింపసాగిరి.

ఈతనితమ్ముడు జ్ఞానప్రకాశుడు గురువునద్ద విద్యాభ్యాసము చేయుచుండెను. సత్యునిహృదయము మరుభూమివలె ప్రేమహీనమైపోయెను. కాని అందులో తమ్మునిపయిఉన్న ప్రేమ ఒకపచ్చనిబైలువలె మెరయుచుండెను. ప్రేమాభివృద్ధి ఉభయదిక్కులయందు సమానముగా పెరుగుచుండెను. జ్ఞానుడు తనతలిదండ్రులతో సత్యునికి బట్టలుమొదలగునవి ఇమ్మని పోరాడుచుండెను.

ఒకనాడు తండ్రి సత్యునిపిలిచి పాఠశాలకు పోకపోవుటకు కారణము అడుగుచుండెను.

దేవ:—సత్యమా! నీవు స్కూలుకు ఎందుచేత వెళ్లుటలేదు?

సత్య:—స్కూలులో జీతముకట్టనందున జుర్మానా వేసినారు; సొమ్ము బాకీఉండుటచేత క్లాసుకువెళ్లినను ఉండనిచ్చుటలేదు.

దేవ:—జీతము ఏల యివ్వలేదు?

సత్య:—క్రితంసారి జీతము ఇచ్చేసమయమునకు చందాదారులు కొందరువచ్చి అడుగగానే నేనువారికి ఇస్తిని.

దేవ:—నీవు జీతముకట్టక చందా ఏలయిస్తివి?

సత్య:—తమ్ముడు ఇచ్చినపుడు నేనును అడుగగా లేదనిచెప్పలేక, చెప్పినను మీకు అవమానమని తలంచి ఇచ్చివేస్తిని.

దేవ:—వాడికి నీకు సాపత్న్యమా? వాడినిచూచి నీవు ఈర్ష్యనొందుచున్నావు. నీకు నేను ఇక చదువు చెప్పించలేను. ఒకక్లాసులో రెండుమూడేండ్లు ఉన్న డబ్బు ఖర్చుపెట్టుటకు నాకు శక్తిలేదు. నీకు చదువుయందు జ్ఞానునికున్నంత శ్రద్ధయైనలేదు.

సత్య:—చదువు నాఅదృష్టంలోనే లేదు. ఏమిచేయను?

దేవ:—నీ అదృష్టంలో మరి ఏమియున్నది?

సత్యా:—ఈస్థితిలో 'ముష్టి' తప్ప వేరే ఏమిలేదు.

దేవ:—అట్లయిన నీవు ఈరోజునుంచి ఆపనే చేయుము; నీగుణములుకూడా మారినవి. రేపటినుండి స్కూలులో పేరు కొట్టివేయించెదను.

ఇంటిలో లోనుండి దేవప్రియ వచ్చి రాజుతున్నఅగ్నిలో నెయ్యిపోసి జ్వాలచేసెను. ఆమె ఇట్లు అనెను:—నీవు సిగ్గులేక మాటకు జవాబుచెప్పుచున్నావా?

సత్యా:—(ఇట్టిమాటలు సహించలేక) నాకు దిక్కుఉన్ననూ దిక్కులేని అనాథులవలె అయిపోతిని. నాకు భిక్షాటనే జీవితోపాధి అయినప్పుడు ఇట్టిసుఖము ఏల అనుభవించుదును?

దేవప్రియ:—రోజూ ఏమి అనలేక ఊరకుండుటచే పౌరుషము ఎక్కువయినది. నీమాటలు నేను సహించలేను.

దేవప్రకాశుడు కోపముతో వెళ్లిపోయెను.

ఈచిత్రకథ సత్యప్రకాశుని ఆత్మకు ఒకపాఠము నేర్పెను. వాడు ఇక ఒకనిమిషమైనా అచ్చటనిలుచుటకు ఇచ్ఛలేక ప్రయాణము నిశ్చయించెను. వయస్సుకూడా 16 వత్సరములాయెను. ఇట్టిజీవితముకన్న ఎచటనైనా పనిచేసుకొనిసంపాదించుట మేలనితలచి ఒకనాడు మధ్యాహ్నము అందరునిద్రించుచున్న నిశ్శబ్దసమయమున సత్యప్రకాశుడు తమ్మునివద్దకువచ్చి "వెళ్లివచ్చెద"ననెను. జ్ఞానుడు దుఃఖముతో కన్నీళ్లుకార్చుచూ "ఎక్కడికి? నీవువెళ్లవద్దు. అమ్మతో చెప్పెద"ననెను. సత్యుడు వానిని ఓదార్చి "నీవు చెప్పవసరములేదు. అట్లు చేసిన నీకు తెలియకుండా వెళ్లిపోవలసివచ్చును. నాఅదృష్టమునునిరీక్షించుటకు వెళ్ళుచున్నాను. ఎచ్చటనైనా స్థిరపడిన నీకు తెల్పెద"ననెను. ఇట్లుప్రసంగించి సోదరునికౌగలించుకొని వీధిబాటను నడచిపోయెను. జ్ఞానుడు ఆతడు అదృశ్యుడగువరకు అటుచూచుచుండెను. ఏమిచేయగలడు? జీవితము దైవాధీనము.

ఇట్లు బయలుదేరి కొన్నిరోజులకు సత్యప్రకాశుడు కలకత్తాజేరెను. కొద్దిరోజులు ఎచ్చటనోగడిపి ఒక తపాలాఫీసువద్ద ఉత్తరములువ్రాసి డబ్బుసంపాదించుటకు మొదలుపెట్టెను; కొద్దిదినములు రోజుకు ఒక రూపాయవరకు సంపాదించెను. మరల కొంతడబ్బును వంటవండుటకు, తిండికి ఖర్చుపెట్టి తక్కినసొమ్మును పోగుచేసి ఒక చిన్నచిల్లరసామానులదుకాణము తెరచెను. దానితో కాలముగడుపుచూ ఇతరస్నేహితులతో తిరుగుచూ దుకాణముమీదవచ్చిన డబ్బుఅంతా సాదరుకు ఖర్చుపరచుచుండెను. తాను ఇట్లు బ్రతుకుచున్న సంగతి తమ్మునకు స్కూలువిలాసమునకు ఒకపత్రముపంపెను.

ఇట్లుఉండగా ఆతనికిఒకనాడు తమ్మునికి ఏదైనా కానుకపంపుదమని ఆలోచనగల్గెను. దానికి డబ్బు కావలసి తాను సాదరుఖర్చుమాని తిండికికూడా మితమైనఖర్చుచేసి నాలుగు నెలలకు 50 రూపాయలు పోగుచేసి ఒకగడియారముకొని పంపెను. ఆదినము వానికిగల సంతోషమునకు మితిలేదు. ఆకానుక తమ్ముడు పుచ్చుకొని ఎంతసంతోషించునో అది ఆలోచించుకొనుచూ తానుకూడా సంతోషభరితుడాయెను. నిస్వార్థమైన ప్రేమసౌఖ్యము వర్ణనాతీతము. కాని ఒకక్షణాంతరమందు తన తలిదండ్రులు జ్ఞప్తికివచ్చి విచారసాగరములో కూలెను. ముఖ్యముగా సత్యుని ప్రాణాధారము జ్ఞానప్రకాశుడే అని చెప్పవచ్చును. ఆతనిజీవమే ఇతని జీవాధారమువలెనున్నది. ఆతడు లేనిచో ఎంతకాలమునకుపూర్వమునో ఈతడు అంతరించి ఈప్రపంచకమునే వినుగుచెంది వదలియుండును.

౬

ఒకనాటిసాయంకాలము దేవప్రకాశుడు తనభార్యతో జ్ఞానుని వివాహమునుగురించి మాట్లాడుచుండెను. జ్ఞానుడుకి అన్నగారికి వివాహముకాకపూర్వము చేసికొనుటకిష్టములేక అయిదువేలరూప్యములు కట్నమునిచ్చుటకు సిద్ధముగానున్న సంబంధమునుతిరుగగొట్టెనని తల్లికి కోపమువచ్చెను. "జ్యేష్ఠపుత్రుడు కలకత్తాలో వివాహమాడి సంసారనిర్మాణముజేసియేయుండును. కావున అతనికి వివాహముజేయుట అనవసర"మని తల్లి పలికెను. జ్ఞానుడికికోపమువచ్చి లేచిపోయెను. ఎంతబోధించినను తనమాట జ్ఞానుడు తప్పలేదు.

ఏమియు ఉపాయముతోచక సత్యుడిని రమ్మనమని ఉత్తరంవ్రాయుటకు దేవప్రకాశుడు నిశ్చయించుకొనెను. కాని ఇదివరకు యెన్నడు ఒకఉత్తరమైనావ్రాయనందున ఏమితలచునో అనేసిగ్గుచే పకసారి వెనుకకుతగ్గెను. కాని మరల తానుచేసినతప్పుకు క్షమార్పణకోరుచూ తనుపిల్చుటచే వచ్చుటకు ఇష్టములేకపోయినను జ్ఞానుడి ప్రేమకొరకైననూ ఈవివాహబంధనములోపడుటకు నిరోధించి ఉత్తరమువ్రాసెను.

సత్యుడు ఈపత్రముచూచుకొని ఏమిచేయుటకును నిశ్చయించలేకపోయెను. చివరకు తండ్రిపేర ఒక ఉత్తరము, తమ్ముని పేర ఒకఉత్తరమున్ను వ్రాసెను. అందున తండ్రి ఇంతకాలముపకు తన్ను తలచినందుకు సంతోషించినట్లు, తమ్ముడి వివాహము తను రాకపోయినను తప్పక చేయుమనిన్ని, తానువచ్చుటకు వీలులేకపోయినందుకు క్షమించమనిన్ని, ఉత్తరముతో పంపిన అయిదువందలరూపాయలు తమ్ముడికి కానుక ఇమ్మని వ్రాసిపంపెను. తల్లిగారికి నమస్కారములుకూడా వ్రాసెను.

ఈఉత్తరముచూచుకొని దేవప్రకాశుడు సిగ్గు, గ్లానితో పీడితుడై దుఃఖించుచుండగా భార్యవచ్చి "విషకుంభపయోముఖం" అన్నమాటను సమర్థిస్తూ సత్యుడి ప్రేమ కేవలము డాంబికమనిచెప్పి ఆ విచారభావమును తొలగించెను.

జ్ఞానప్రకాశుడు తనపత్రము చూచుకొని, దుఃఖించి, కలకత్తావచ్చి అన్నగారిని తీసుకవెడుదమని ప్రయాణమాయెను. కాని తలిదండ్రుల ఆగ్రహమునకు మీరలేక మానివేసెను. పైగా తల్లి ఆమె బ్రతికినంత కాలము వాడు ఇల్లుకదలనని ప్రతిజ్ఞ చేయించుకొని బంధునిగాచేసెను.

ఇట్లు కొంతకాలముగడచెను. జ్ఞానుడు ఆచార్యపరీక్షలో ఉత్తీర్ణుడై ఒకపాఠశాలలో అధ్యాపకుడుగ ప్రవేశించి కాలముగడపుచుండెను. వానితల్లి చుట్టుప్రక్కని ఇండ్లలోజరిగే శుభకార్యములుచూచి తాను కోడలినుఖమునకు వంచింపబడెనని దుఃఖిస్తూ, ఆదుఃఖమునకు మూలకారణము సత్యుడు బ్రతికియుండుటయేఅని వానిని నిందిస్తూ కాలయాపనచేయుచుండెను. నిత్యము దేవీపారాయణకన్న ఎక్కువనిష్ఠగా సత్యప్రకాశునకు నాశనసూచకమైన ఆశీర్వచనములు ఇచ్చుచుండెను.

సత్యప్రకాశుడు పూర్వమువలె జ్ఞానుడికి వివాహముచేసుకొనుటకు ఆగ్రహముమాపుచూ భావపూరితమైన లేఖలువ్రాయుచుండెను. కాని ఈఅధ్యాపకునకు అవి చెవిటివానికి శంఖవాద్యప్రాయమాయెను. అపుడపుడు సత్యప్రకాశునికి ఈఒంటరిజీవితముచే విసుగుపుట్టి ఇంటికివెళ్లి నూతనసంసారస్థాపనజేయుటకు బుద్ధి కలుగుచుండెను. కాని అగృహాగ్నిజ్వాలకన్న ఈజీవితమే సుఖతరమనితలచి మరల దైవము తనకుఅంతేఇచ్చెనని ఊరకుండుచుండెను.

ఈవిమర్శ కొద్దిరోజులువరకుజరిగెను. సంధ్యాకాలమున తనఇంటిఎదుట మంచముపైకూర్చుని ఆలోచించుచుండగా తపాలావాడు వచ్చి రెండుఉత్తరములు ఇచ్చెను. అందులో ఒకటి తమ్ముడువ్రాసినది. చదువుకొని సంతోషించెను. రెండవది విప్పిచదువగానే ముఖము తెల్లబారి, దుఃఖమేఘము వచ్చి మోమునుకప్పించెను. కండ్లనుండి అశ్రుధారలువచ్చెను. హృదయముకొట్టుకొనుటకు మొదలుపెట్టెను. పత్రము చేతినుండి క్రింద

పడెను. అతనికి తెలియదు. కొంతసేపటికి జ్ఞప్తికివచ్చి "హా దైవమా! నీవేసాక్షి. నాకు తమ్మునియందున్న ప్రేమ పట్టి ఆడంబరమా? అది వానిని నాశముచేయుటకు చేసినదా? వాడినాశనము నాకు సుఖకరమా?" అని దుఃఖింపసాగెను. సత్యుని హృదయమందు ఇంతపనిచేసిన పత్రము వానిచెల్లెలగు దేవప్రియ వ్రాసినదే. ఆమె చేసిన నాశనపూర్వకమైన ఆశీర్వచనములు ఉత్తరముద్వారా వినికంపెను. ఇంటివద్ద తిట్టినచో వినికి వినబడదనితలచి స్వంతముగా ఒక పెద్దకవరులో తనయాపత్తుకోపమూతీరునట్లు వ్రాసిపంపెను. ఆరోజు మొదలు నిత్యము ఒకటిరెండుపత్రములు సత్యునికందుచుండెను. అతడు పత్రము చదువకపూర్వమే తునకలుచేసి అగ్నిలో అదుర్ల ఖనితో చెడినకాగితము పవిత్రముచేయుచుండెను.

౨

ఇప్పుడు సత్యునికి ఒకవిధమైన మనోరోగము. దుకాణముముగించి ఇంటివద్దనే పడుకొనియుండి ఏదో దీర్ఘాలోచనలో మునుగుచుండెను. వానిజన్మలో జరిగినయాపత్తుసంగతులు ఛాయాపటములవలెఆడుచుండెను.

ఇట్లు ఒక నెలగడచెను. ఒకనాడుసాయంకాలమున 6 గంటలకు తలుపువద్ద పిలుపు వినబడెను. పరిచిత స్వరము. సత్యునిగుండెలు దడదడలాడెను. తలుపు తెరచుటకు లేచెనుగాని రెండునిమిషములు అక్కడే నిలబడియుండెను. ఎట్లో వెళ్లి తలుపు తెరచెను. ఎదుట జ్ఞానునిస్వరూపము కాన్పడెను. సత్యుడు అది నిజమా లేక కలయా అని దగ్గరకివెళ్లి కౌగలించుకొనెను. రెండుమూడునిమిషములయనంతరమున తెలివివచ్చెను. సోదరులు ఇద్దరు వేరుపడినతర్వాత ఆరుఏండ్లకు కలుసుటకు ఇదే మొదటిసారి. ఎన్నిసారులు మాట్లాడుటకు ప్రయత్నించినను మాట రాలేదు. అన్నగారి శరీరస్థితిచూచి తమ్ముడు అతిదుఃఖించెను. వాని మలినవస్త్రములు, శుభ్రముగాలేనిగృహము, ఒకచీకటిగదిలో మిటమిటలాడుచున్నదీపముచూచి అశ్రువులు తుపానుచేపీడితమైన సముద్రపుకెరటములవలె ఉప్పొంగివచ్చుచుండెను.

అప్పుడు సత్యప్రకాశుడు వానిని ఓదార్చి ఇంటియొక్క యోగక్షేమములు అడుగుచూ మంచముమీద కూర్చుండబెట్టెను. వీని దీనఅవస్థచూచినకొలది అతడు ఏడ్చేగాని మాటలేదు. సత్యుడు ఇట్లు ప్రశ్నించెను: నీవు వచ్చెదనని తెలియపరచనైనా లేదేమి?

జ్ఞానుడు:—నేను వ్రాస్తినిగాని అందలేదు కాబోలు.

సత్య:—కావచ్చును. నేను దుకాణమునకు వెళ్ళుటలేదు. ఇంటివద్ద అంతా క్షేమమా?

జ్ఞానుడు:—తల్లిగారు స్వర్గస్థులైనారు.

సత్య:—(ఆశ్చర్యపోయి) శ్రీహరి! ఏమంటివి? వారికి ఏమిజబ్బుచేసెను?

జ్ఞానుడు:—జబ్బులేదు. మందుతినెను.

సత్య:—తండ్రిగారు కులాసాగానున్నారా?

జ్ఞానుడు:—కుశలమేగాని ఇంకా గతించలేదు.

సత్య:—అదేమి? జబ్బుగానున్నారా?

జ్ఞానుడు:—"అమ్మ విషము మ్రింగినపుడు అయన ఏదో మందు నోటిలోపోసినపుడు అయన రెండు వ్రేళ్ళు అమ్మ కొరికివేసెను. అందుచే శరీరమందు విషమువ్యాపించి ఆసుపత్రిలో అంత్యఘడియలులెక్కపెట్టుకొనుచున్నాడు." అనగానే సత్యుడు ఒకనిట్టూర్పువిడచి "హా దైవమా! గృహజ్వాలచే గృహముభస్మమైనదా?" అనెను. తిరిగి రెండవరోజు ప్రాతఃకాలమున ఇద్దరుసోదరులు కలకత్తానుండి పయనమాయిరి.

—ప్రేమచంద్రుని కథానువాదము.